





నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
గురువారం 15 జనవరి 2026 పేజీలు 8







## అంతా ఆర్భాటమే...

- రెవెన్యూ, పోలీస్ అధికారుల హడావుడి ప్రకటనల వరకే..
- గ్రామాలలో జోరుగా సాగుతున్న కోడిపందాలు, జూదం
- కన్నెత్తి చూడని సంబంధిత శాఖలు

2



## పెదపులిపాకబరిలో కొట్లాట

- ప్రమాదస్థితిలోకి ఇరువురు వ్యక్తులు
- సీపీఆర్ చేసి ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు
- కానరాని పోలీసులు

విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : కోడి పందాలాట విధ్వంసానికి దారితీసింది. నిర్వాహకుల అత్యుత్సాహంతో ఇరువురు వ్యక్తులు ప్రమాదకర స్థితిలోకి వెళ్లిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఎన్టీఆర్ జిల్లా పెదపులిపాకలో మిగతా 2లో...




(మొదటిపేజీ తరువాయి)

## పెదపులిపాక బరిలో కొట్లాట

అనధికారికంగా కోడిపందెలా నిర్వహణ జరుగుతోంది. అయితే ఈ సమయంలో కోడి పందాలను తిలకించేందుకు కొంత మంది స్థానికంగా ఉండే వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు. అయితే పక్కనున్న వ్యక్తులు పెద్దఎత్తున బెట్టింగులు కాయడంతో పోరంకికి చెందిన వ్యక్తి జూదం పెనుప్రమాదం వద్దు వారిని సముదాయించే ప్రయత్నం అని చేసినప్పటికి లోపల ఉన్నటు వంటి నిర్వాహకులు ఇతనితో గొడవపడి పందెం రాయుళ్లను లోపలికి అనుమతించారు. ఆ తరువాత ఆ పందెం ఓడిపోవడంతో సదరు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై దుర్భాషలాడుతూ దాడి చేయడమే కాకుండా అతని స్నేహితులపై కూడా విచక్షణా రహితంగా కొట్టారు. సదరు బాధితుడు పోలీసులు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అయితే అర్థరాత్రి కోడి పందెలా నిర్వహణ అనేది లేకపోయిన పోలీసులు అనుమతి ఇచ్చి ప్రోత్సహించడం పలు విమర్శలకు తావిస్తోంది. రేపు ఈ వ్యవహారంపై సీపీని కలిసే యోచనలో బాధితులు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పెదపులిపాక కోడి పందెల బరిలో దాడికి పాల్పడిన నిందితుల చేతిలో గాయపడ్డ బాధితులు విజయవాడలోని ఓ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్నట్లు సమాచారం. చూడాలి పోలీసులు ఈ ఘటనపై ఏ విధంగా స్పందిస్తారనేది...

## రెండు పళ్ళ విభాగాన్ని ప్రారంభించిన టీడీపీ ప్రధాన కార్యదర్శి బుల్లయ్య



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల మహాత్మా గాంధీ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి బండలాగుడు పోటీలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనకళ జగన్నాధరావు (బుల్లయ్య) బుధవారం ప్రారంభించారు.. ముందుగా ఆవుల అందాల పోటీలను ఘంటసాల పిఎసిఎస్ చైర్మన్ బండి పరాత్పరరావు, డిసి చైర్మన్ అయినపూడి. భాను ప్రకాష్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఆధ్వర్యంలో తిలకించి, నియోజకవర్గ ఇన్చార్జ్ కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బ గోవర్ధన్ తదితరులు అందాల పోటీలను ప్రారంభించారు. వారితోపాటు వేమూరు రాజేంద్రప్రసాద్ దోనేపూడి రవిశంకర్, గొర్రెపాటి వెంకట నరసింహారావు గొర్రెపాటి సురేష్ కాకమోను రంగారావు, అయినపూడి. సన్నీ, వేమూరి వెంకయ్య పాల్గొని పోటీలను తిలకించారు.

## కనుల పండువగా శ్రీనివాస గోదాదేవి కల్యాణం





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రీనివాస గోదాదేవి కల్యాణం మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) మేనేజింగ్ డైరెక్టర్, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బుధవారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా వేద పండితులు గోదాదేవి కల్యాణ విశిష్టతను భక్తులకు విశదీకరించారు. గోదాదేవి అంటే భూమి నుంచి పుట్టిందన్నారు. ఆ తల్లి శ్రీ వెంకటేశ్వరుని పరిణయం చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ధనుర్మాసంలో కల్యాణం చేస్తారన్నారు. భూ మాత అనుగ్రహం వలన పంటలు బాగా పండిన సంతోషంతో సంక్రాంతి పండగను జరుకుంటారన్నారు. గోదాదేవి కల్యాణం, సంక్రాంతి పండగను పురస్కరించుకుని డోకిపర్రు వెంకటేశ్వరాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కల్యాణానికి ముందు దేవాలయంలో స్నపన తిరుమంజనం, అభిషేకం, ఎదుర్కొళ్లు నిర్వహించారు. కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే గుడ్లవల్లేరులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో గోదా కల్యాణాన్ని వేద పండితులు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, పవన్‌కుమార్ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# అంతా ఆర్భాటమే...

### రెవెన్యూ, పోలీస్ అధికారుల హడావుడి ప్రకటనల వరుకే..

### గ్రామాలలో జోరుగా సాగుతున్న కోడిపందాలు, జూదం

### కన్నెత్తి చూడని సంబంధిత శాఖలు





**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** ఒకవైపు రెవెన్యూ, పోలీస్ అధికారులు గ్రామాలలో ఎంతో ఆర్భాటంగా కోడిపందాలు వేస్తే నేరమని, అందులో పాల్గొన్న నేరమేనంటూ ప్రచారాలు చేసినా మండలములోని పలు గ్రామాల్లో బుధవారం కోడిపందాలు విచ్చలవిడిగా సాగాయి. మండల పరిధిలోని యలమర్రు, భూషణగుళ్ళ, పెదపారుపూడి గ్రామాలలో భారీ ఎత్తున కోడి పందాలు, జూదం, గుండాట వంటి ఆటలు సాగినా అధికారులు ఆ గ్రామాల వైపు కనీసం కన్నెత్తి చూడకపోవడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు కోర్టు ఎటువంటి కోడిపందాలు, జూద క్రీడలు నిర్వహించరాదని, నిర్వహిస్తే ఆయా జిల్లాల కలెక్టర్లు ఎస్పీలు బాధ్యత వహించాలంటూ తాఖీదులు ఇచ్చినా క్రింది స్థాయిలో ఈ మేరకు ఆ రెండు శాఖల అధికారులు కోడిపందాల నిర్వాహకులతో కుమ్మక్కు కావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం యలమర్రు గ్రామంలో తహసిల్దార్ శ్రీను నాయక్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీ కూడా నిర్వహించారు. కోడి పందాలు నిర్వహించడం నేరమని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాక ఎక్కడైనా కోడిపందాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలంటూ ఆర్భాటంగా ప్రకటన చేశారు. అయితే అదే గ్రామంలో పెద్ద ఎత్తున బుధవారం కోడిపందాలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలు జరిగినా కనీసం అటువైపు చూడకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. కోడిపందాల నిర్వాహకుల నుండి పెద్ద ఎత్తున అధికారులకు ముడుపులు అందాయని, అందువల్లనే అటువైపు పోలీసులు, రెవిన్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. రోడ్లు పక్కన, డొంకలలో ఒకటి అర పందాలు వేసుకునే చిన్న చిన్న వారిపై మాత్రం దాడులు చేసి కోడిపందాలు వేస్తున్న వారిని, జూదం ఆడుతున్న వారిని అరెస్ట్ చేసామంటూ ప్రకటనలు చేయడం పోలీసులకు రివాజుగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మకర జ్యోతి మహోత్సవంలో అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ







**హనుమాన్ జంక్షన్, జనవరి 14, మేజర్ న్యూస్ :** మకర జ్యోతి దర్శనాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలం పెరికిడు గ్రామంలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. భోగి పండుగ సందర్భంగా బుధవారం రాత్రి ఆలయంలో మకర జ్యోతి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డకు ఆలయ నిర్వహకులు నూలు నరసింహారావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గణపతి పూజ, అష్టాదశ కలశారాధనతో పాటు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, భక్తిశ్రద్ధలతో యార్లగడ్డ స్వామివారి సేవల్లో పాల్గొన్నారు. తదుపరి ఆలయంలోని పవిత్రమైన పదినెట్టాంబడి మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రతి మెట్టుపై కలశాలను ఉంచి కర్పూర హారతులు వెలిగించారు. మేళతాళాల నాదం, భక్తుల జయజయధ్వానాల మధ్య 58 కేజీల కర్పూరంతో మకర జ్యోతిని వెలిగించడంతో ఆలయ ప్రాంగణం దివ్య కాంతులతో వెలిగిపోయింది. బాణాసంచా శబ్దాలు, భక్తుల హర్షధ్వానాలతో ఆ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దాసరి బాలవర్ధనరావు, ముద్రబోయిన వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు డాక్టర్ దుట్టా రామచంద్రరావు, చలమలశెట్టి రమేష్‌బాబు, వీరమాచినేని సత్యప్రసాద్, దయ్యాల రాజేశ్వరరావు, చింతల వెంకట శివ అప్పారావు, వేగిరెడ్డి పాపారావు, గుండపనేని ఉమా ప్రసాద్, మూల్పూరి సాయి కళ్యాణి, నందూరి సత్య వెంకట శర్మ, కొమ్మారెడ్డి రాజేష్, మున్నంగి బాబురావు, జాస్తి భూపతి, కేతినీడి జైనేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మకర జ్యోతి మహోత్సవాన్ని కనులారా వీక్షించి తరించారు.

## జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో యార్లగడ్డ ప్రత్యేక ప్రార్థనలు..



**గన్నవరం, జనవరి 14, మేజర్ న్యూస్ :** గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పెదఅవుటపల్లిలోని ప్రసిద్ధ బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. క్షేత్ర నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు బుధవారం రాత్రి పుణ్యక్షేత్రానికి చేరుకున్న ఎమ్మెల్యే వెంకట్రావ్ కు క్రైస్తవ మత పెద్దలు, భక్తులు ఘనస్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్యే పుణ్యక్షేత్రంలో తంబి సమాధిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్షేత్ర బాధ్యులు పాలడుగు జోసఫ్ ఫాదర్, యార్లగడ్డ వెంకట్రావును శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ కొలిచే బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం సంతోషకరమని అన్నారు. బ్రదర్ జోసఫ్ తంబి ఈ ప్రాంతంలోని పేదలకు ఎంతో సేవ చేశారని ఆయన సేవలు మరువలేనని కొనియాడారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు తన ప్రార్థనల ద్వారా స్వస్థత పరిచి దైవజనులుగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని యార్లగడ్డ ఆకాంక్షించారు. పుణ్యక్షేత్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆలయ విశిష్టతను వివరిస్తూ బ్రదర్ జోసఫ్ తంబి ఈ ప్రాంతంలో చేసిన సామాజిక సేవలను, క్షేత్రానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. నిస్వార్థ సేవకు జోసఫ్ తంబి నిలువుటద్దమని, ఆయన మార్గదర్శకత్వంలో ఇక్కడ అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ ఉపాధ్యక్షులు కొండేటి వెంకటేశ్వర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## గోకులం షెడ్డులను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

**వత్సవాయి జనవరి 14 మేజర్ న్యూస్ :** పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా వత్సవాయి మండలం కొత్త వేమవరం, పాత వేమవరం గ్రామాలలో రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గోకులం షెడ్డులను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ, పశుపోషక రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, గోకులం షెడ్డుల ద్వారా పశువుల సంరక్షణ మెరుగుపడి రైతులకు ఆర్థిక భద్రత కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, నంబూరి శ్రీనివాసరావు, దామాల పెద్ద బాబు, ఏపూరి నాగ శ్రీను, బొల్లా వెంకటేశ్వరరావు, పరమేశ్ ,కృష్ణ, ఓంకార్, వెంకటరమణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

# బీబీజీ సంక్రాంతి సంబరాలు

## లక్కీడ్రాలో ఉచిత ప్లాట్ పంపిణీ.. కొత్త కొనుగోలుదారులకు భారీ ఆఫర్లు

**విజయవాడ జనవరి 14, మేజర్ న్యూస్ :** ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బీబీజీ) సంక్రాంతి పండుగ వేళ తమ వినియోగదారులకు అదిరిపోయే కానుకలను ప్రకటించింది. "ఫ్రీ రిజిస్ట్రేషన్ నుండి ఫ్రీ ప్లాట్ వరకు" పేరుతో నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం భారీ లక్కీ డ్రాను నిర్వహించి విజేతను ప్రకటించింది.





బెవర్లీ హిల్స్ కాజా (కాజా), ఫార్చ్యూన్ ఎంపైర్ సిటీ (చలివేంద్రపాలెం), క్యాపిటల్ వెస్ట్ (కొండపావులూరు)లలో ప్లాట్లు కొను గోలు చేసిన మొదటి 100 మంది కస్టమర్ల నుంచి లక్కీ డ్రా ద్వారా విజేతను ఎంపిక చేశారు. ఈ డ్రాలో మాచర్లకు చెందిన వి. కిరణ్ అదృష్ట విజేతగా నిలిచారు. బీబీజీ సీఎండీ ఎం.వి. మల్లికార్జున్ రెడ్డి చేతుల మీదుగా విజేతకు బెవర్లీ హిల్స్ కాజాలో 30 లక్షల విలువైన 133.33 చదరపు గజాల ప్లాట్‌ను ఉచితంగా అందజేశారు. మిగతా 99 ప్లాట్ యజమానులకు రూ. 10,000 గిఫ్ట్ కూపన్లు బహుమతిగా లభించడం ఆశ్చర్యకరమైన సంతృప్తినిచ్చింది.

**కొత్త ఆఫర్: ఉచిత రిజిస్ట్రేషన్, స్మార్ట్ టీవీ.....**

వినియోగదారుల నుంచి వస్తున్న విశేష స్పందనను చూసి, బీబీజీ మేనేజ్‌మెంట్ మరిన్ని పండుగ ఆఫర్లను (జనవరి 14నుండి 16) ప్రకటించింది. కొత్తగా ప్లాట్లు కొనుగోలు చేసే వారికి ఉచిత రిజిస్ట్రేషన్: ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం లేకుండా సంస్థే భరిస్తుంది నిర్ణీత గడువులోగా ప్లాట్ బుక్ చేసుకున్న వారికి 55 అంగుళాల భారీ స్మార్ట్ ఎల్ఈడీ టీవీని ఉచితంగా అందజేయనున్నారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ... "పారదర్శకత, కస్టమర్ల సంతృప్తికే తాము మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, సామాన్యులకు కూడా ప్లాట్ సొంతం చేసుకునే అవకాశాన్ని కల్పించడమే బీబీజీ లక్ష్యమని" ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సహచరులు పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నారు. మరిన్ని వివరాల కోసం వినియోగదారులు 040 – 6903 2244 నంబర్‌ను సంప్రదించవచ్చు లేదా https://amaravati.bbgindia.com వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# నిమ్మకూరులో కన్నుల పండుగగా గోదాదేవి కళ్యాణం

**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నిమ్మకూరులో గల తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో బుధవారం ఉదయం గోదాదేవి కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. దేవస్థానం ఆచార్యులు సుదర్శనం లక్ష్మి నర్సింహా ఆచార్యులు, సుదర్శనం బద్రి నారాయణాచార్యులు ఈ కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్య లో భక్తులు పాల్గొని కళ్యాణం తిలకించారు.

టిటిడి సహకారంతో శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాద సేవా ట్రస్ట్ అధ్యక్షులు సూరపనేని చంద్రశేఖరరావు, కార్యదర్శి నందమూరి జయకృష్ణ ప్రసాద్, కోశాధికారి పి.ఎం.ఎస్ ప్రసాద్, ట్రస్ట్ లు నందమూరి శివరామకృష్ణ,





అరిగెల బాలుడు, ఎస్.రమాదేవి, అనగాని మురళి తదితరులు పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

# ఏఐ రెడీ సార్వభౌమ క్లౌడ్ పెట్టుబడికి జేఎల్ఎల్‌ను సలహాదారుగా నియమించిన భారత్ క్లౌడ్

**విజయవాడ, జనవరి 14, మేజర్ న్యూస్ :** భారతదేశంలోని ప్రధాన నగరాలు, ఎంపిక చేసిన అంతర్జాతీయ ప్రదేశాలలో ఏఐ – రెడీ సావరిన్ క్లౌడ్ మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని సులభతరం చేయడానికి జేఎల్ఎల్‌ని సలహా భాగస్వామిగా భారత్‌క్లౌడ్ నియమించింది. బోర్డు ఆమోదాలు, ఫైనాన్సింగ్ ఏర్పాట్లు, నియంత్రణ అనుమతులు, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు లోబడి, రాబోయే ఐదేళ్లలో 100 మిలియన్ల డాలర్ల వరకు పెట్టుబడి పెట్టాలని భారత్‌క్లౌడ్ యోచిస్తోంది. ఈ ఏర్పాటులో భాగంగా జెఎల్ఎల్ ప్రత్యేక సలహా భాగస్వామిగా వ్యవహరిస్తుంది. కోలొకేషన్ సైట్ గుర్తింపు, డిజైన్ కన్సల్టెన్సీ, పోర్ట్ ఫోలియో ఆప్టిమైజేషన్‌లో భారత్‌క్లౌడ్‌కు మద్దతు ఇస్తుంది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ ఎన్సీఆర్, కోల్‌కతా, పుణె వంటి నగరాల్లో వైజాగ్, అహ్మదాబాద్, జైపూర్, కోయంబత్తూర్, కొచ్చి, చండీగఢ్, భోపాల్‌తో సహా ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రాంతాల్లో ప్రపంచ స్థాయి ఎడ్జ్ క్లౌడ్ మౌలిక సదుపాయాలను అందించాలని ఈ కంపెనీలు కలిసి లక్ష్యంగా పెట్టుకున్నాయి. డిజిటల్ గవర్నెన్స్, ప్రైవేట్ రంగ సహకారాన్ని ప్రారంభించడానికి భారతదేశం తన 5జి, ఐఓటీ, ఏఐ –రెడీ క్లౌడ్ మౌలిక సదుపా యాలను వేగవంతం చేస్తున్నందున, భారత్‌క్లౌడ్ గణనీయమైన పురోగతిని సాధిస్తోంది. ప్రముఖ గ్లోబల్ ఇంటర్‌కనెక్షన్ ప్లాట్ ఫామ్ అయిన డిఇ–సిఐఎక్స్‌ఇండియాతో తన మునుపటి భాగస్వామ్యాన్ని నిర్మించుకుంటూ, భారత్‌క్లౌడ్ ఇప్పుడు క్లౌడ్ సెంటర్ అభివృద్ధి కోసం జేఎల్ఎల్ తో తన అనుబంధాన్ని బలోపేతం చేస్తోంది. ఈ సహకారం, పటిష్ఠరీతిలో పంపిణీ చేయబడిన క్లౌడ్ పర్యావరణ వ్యవస్థను స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఎంటర్‌ప్రైజ్ ఎడ్జ్ కంప్యూటింగ్ కోసం ఏఐ, ఐఓటీ, 5జి టెక్నాలజీల సజావైన ఏకీకరణను అనుమతించే కీలకమైన ఆర్కెస్ట్రేటర్‌గా భారత్‌క్లౌడ్ ను ఉంచుతుంది.

ఈ వ్యూహాత్మక చర్య భారత దేశంలో మొదటిసారిగా పూర్తిగా పనిచేసే డిజిటల్ ట్రయాంగిల్‌ను సృష్టిస్తుంది. ఇది అపూర్వమైన విలువ అవకాశాలను అందిస్తుంది. డిఇ–సిఐఎక్స్‌యొక్క ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఇంటర్‌కనెక్షన్ ఎకోసిస్టమ్‌ను భారత్‌క్లౌడ్ యొక్క సురక్షితమైన, సావరిన్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో అనుసంధానించడం ద్వారా, ఈ కూటమి భారతదేశంలో డిజిటల్ కనెక్టివిటీ భవిష్యత్తును చురుకుగా రూపొందిస్తూ సమర్థవంతంగా వృద్ధి చెందడానికి వ్యాపార సంస్థలకు సాధికారి కత ఇస్తుంది. జేఎల్ఎల్ తో ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం భారతదేశంలోనే మొదటి, ఎంటర్‌ప్రైజ్–గ్రేడ్ ఏఐ క్లౌడ్ మౌలిక సదుపాయాలను అభి వృద్ధి చేయడంలో కీలకమైన మైలురాయి" అని భారత్‌క్లౌడ్ సహ వ్యవస్థాపకురాలు పద్మా రెడ్డి సామ అన్నారు. మేం కలిసి, ప్రతి మెట్రోలో కనీసం రెండింటితో ప్రారంభించి, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోకి విస్తరిస్తూ, అగ్రశ్రేణి భద్రత, స్కేలబిలిటీ, కార్యా చరణ సామర్థ్యం, భారతదేశ డేటా సావరిన్ అవసరాలకు అనుగుణంగా ఉండేలా సావరిన్, ఏఐ–ఆధారిత క్లౌడ్ కేంద్రాలను ప్రారం భిస్తాం" అని



అన్నారు. భారతదేశ డేటా సెంటర్ ల్యాండ్‌స్కేప్‌తో క్లౌడ్ సెంటర్ మార్కెట్ ఊపందుకుంటోంది. 2025లో 1.25 జిడబ్ల్యూ నుండి 2035 నాటికి ఆకట్టుకునే 10.5 జిడబ్ల్యూకి సామర్థ్యం పెరుగుతుంది. కేవలం ఒక దశాబ్దంలో ఎనిమిది రెట్లు పెరుగుదల. ఏఐ మౌలిక సదుపా యాల నిర్మాణాలు, క్లౌడ్ మార్కెట్ విస్తరణ, 5జి విస్తరణ, ప్రభుత్వం నేతృత్వంలోని డిజిటల్ చొరవల కలయిక అవకాశాల తుఫా నును సృష్టిస్తోంది, భారతదేశాన్ని ప్రాంతీయ శక్తి కేంద్రంగా మాత్రమే కాకుండా గ్లోబల్ క్లౌడ్ సెంటర్ పర్యావరణ వ్యవస్థలో కీలక మైన కేంద్రంగా స్థాపించింది, ఇక్కడ స్కేలబుల్, స్థిరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి డిజిటల్ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్వ చిస్తోంది" అని ఏపిఏసి లీడ్ రచిత్ మోహన్ అన్నారు. పునరుత్పాదక శక్తి, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు, ఇఎస్జి–అలైన్డ్ కార్యకలాపాలపై బలమైన దృష్టితో, కంప్లైంట్, స్థితిస్థాపకత, స్థిరమైన ఎంటర్ ప్రైజ్–రెడీ సొల్యూషన్‌లను అందించడం భారత్‌క్లౌడ్ లక్ష్యం.

**వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశ డేటా సెంటర్ మార్కెట్**

భారతదేశ డేటా సెంటర్ పరిశ్రమ విస్మరించలేని వృద్ధిని సాధిస్తోంది. రాబోయే దశాబ్దంలో భారతదేశ డేటా సెంటర్ సామర్థ్యం 8 రెట్లు పెరుగుతుందని అంచనా వేయబడింది. వచ్చే ఐదేళ్లలో సామర్థ్యం నాలుగు రెట్లు పెరిగి, ఆ తర్వాత మళ్లీ రెట్టింపు అవు తుందని మేం ఆశిస్తున్నాం. ఈ అద్భుతమైన విస్తరణకు రాబోయే పదేళ్లలో సుమారు 50 బిలియన్ డాలర్ల కొత్త పెట్టుబడులు అవసరమవుతాయి. శిక్షణ, ఇన్ఫరెన్స్ వర్క్‌లోడ్‌ల కోసం ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి ప్రకటించిన భారీ స్థాయి పెట్టుబడులు, డేటా సెంటర్ పరిశ్రమ వృద్ధి అవకాశాలను కొత్త శిఖరాలకు చేర్చాయి. సంఖ్యలే వాస్తవాన్ని తెలియజేస్తున్నాయి: డేటా సెంటర్ సామర్థ్యం 2025 నాటికి ఉన్న 1,250 మెగావాట్ల నుండి 2035 నాటికి 10,500 మెగావాట్లకు అంటే నాలుగు రెట్లు పెరగనుంది. క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, 5జీ మౌలిక సదుపాయాల అవసరాల వల్లే ఈ భారీ వృద్ధి సాధ్యమవుతోంది.

## ఈ నూతన సంవత్సరంలో సాధారణ అలవాట్ల కోసం పెద్ద తీర్మానాలను చేసుకున్న అనన్య పాండే

**విజయవాడ మేజర్ న్యూస్ :** నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ తాను తీసుకునే నిర్ణయాలు వాస్తవానికి దగ్గరగా ఉండాలని అనన్య పాండే కోరుకుంటోంది. తన కొత్త ఇన్‌స్టాగ్రామ్ రీల్‌లో, ఆమె అద్దం ముందు నిల్చొని ఒక స్పష్టమైన నిర్ణయాన్ని పంచుకుంది, నూతన సంవత్సర తీర్మానాలతో వచ్చే సుపరిచితమైన ఒత్తిడిని తానంతట తానే ఎదుర్కొంటూ మాట్లాడుకుంటోంది. కాలం ఎంత త్వరగా మారుతుందో, "కొత్త సంవత్సరం, కొత్త నేను" అనే ఆలోచన ఆందోళనను ఎలా అనుసరిస్తుందో గుర్తిస్తూ, అనన్య మరింత స్థిరమైన విధానాన్ని ఎంచుకుంది. అసాధ్యమైన అంశాలను వెంబడించే బదులు చిన్న, స్థిరమైన అలవాట్లపై దృష్టి పెట్టింది. మంచి నిద్ర పొందడం, హైడ్రేటెడ్‌గా ఉండటం నుండి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వరకు, ఆమె సందేశం పరిపూర్ణత కంటే స్థిరత్వంపై కేంద్రీకృతమై ఉంది. ఆమె తన ఉదయం దినచర్యలో భాగమైన ఒక సాధారణ అలవాటును కూడా వెల్లడించింది. ఆ అలవాటు... కొన్ని కాలిఫోర్నియా బాదంపప్పులతో రోజును ప్రారంభించడం. శక్తి సహజ వనరు అది. రోజంతా ఆమె ఉత్సాహంగా ఉండటంలో బాదం ఆమెకు సహాయపడుతుంది, అయితే వాటి ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ ఇ చర్మ ఆరోగ్యానికి మేలు చేసే యాంటీ–ఏజింగ్ లక్షణాలను అందిస్తాయని చూపబడింది. అందరికీ తగినట్లుగా, భరోసా ఇచ్చేలా ఉన్న ఈ రీల్ ఆత్మీయ, వ్యక్తిగత సందేశంతో ముగుస్తుంది. అనన్య అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, మరింత దయగల, మరింత బుద్ధిపూర్వక సంవత్సరానికి నాంది పలుకుతుంది.



## ఉత్తరప్రదేశ్‌లో 1,750 మంది యువతకు భవిష్యత్ టెక్నాలజీ నైపుణ్యాలను ధృవీకరించిన శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలోని అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తన శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ కార్యక్రమం కింద ఉత్తరప్రదేశ్‌లో 1,750 మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ పూర్తయ్యిందని, వారికి ధృవీకరణ అందించినట్లు ప్రకటించింది. ఇది రాష్ట్రంలో యువతకు నైపుణ్యాలు అందించడంలో శామ్‌సంగ్‌కు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ ధృవీకరణ కార్యక్రమం లక్నోలోని సిటీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ మంత్రి రజనీ తివారీ, విద్యా రంగ నాయకులు, కార్యక్రమ భాగస్వాములు పాల్గొన్నారు. ఈ బ్యాచ్‌తో కలిపి, ఉత్తర ప్రదేశ్‌లో శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ద్వారా శిక్షణ పొందిన మొత్తం విద్యార్థుల సంఖ్య 3,900కు చేరింది. దేశవ్యాప్తంగా 20,000 మంది యువతకు నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంలో భాగంగా, ఉత్తర ప్రదేశ్‌లో మాత్రమే 5,000 మంది యువతను శిక్షణ ఇవ్వాలని శామ్‌సంగ్ ప్రకటించింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువ. ప్రస్తుతం ఈ కార్యక్రమం దేశంలోని 10 రాష్ట్రాల్లో అమలులో ఉంది.

## పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి విశ్రాంత ఘంటసాల వ్యవసాయశాఖ అధికారి కె. నాగేశ్వరరావు నూతన దుస్తులు బహూకరించారు.సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్వచ్ఛ చల్లపల్లి సారధి డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్ చేతులమీదుగా మహిళలకు చీరలు, పురుషులకు (మొత్తం 39 మందికి) ఫ్యాంటు.. షర్టు బిట్లను అందచేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పివి. మాధవేంద్రరావు, విద్యావేత్త యార్లగడ్డ శివప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ సూర్యదుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు బహూకరించిన దాతకు సర్పంచ్ కృష్ణకుమారి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

**Notice**

I SHANTA MANI (Old Name), W/o. PREMANANDA RATNAKUMAR, resident of 23-58, NSN Dwaraka Apt, Ballemvari St, Prasadampadu, Vijayawada Rural, NTR district, Andhra Pradesh - 521108. I have changed my name as SANTHIMANI (New Name), W/o PREMANANDA RATNAKUMAR, Hereafter my name is known as SANTHIMANI (New Name), W/o PREMANANDA RATNAKUMAR.

# తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి







### మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

### గొల్లపూడిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

### భోగి వేడుకలలో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

### భోగిమంటల్లో గత ప్రభుత్వ పాసుపుస్తకాలు దహనం

**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో సంక్రాంతి సంబరాలను ఘనంగా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు, స్థానిక శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సంక్రాంతి సంబరాల్లో బుధవారం తెల్లవారుజామున పాల్గొని భోగిమంటలు వెలిగించారు. ముందుగా దివంగత నేత అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జోహార్ ఎన్టీఆర్ అంటూ నినదించారు. చిన్నారులకు భోగి పళ్ళు పోశారు. పాలపొంగళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. గంగిరెద్దుల విన్యాసాలు తిలకరించారు. ముందుగా సాంప్రదాయబద్దంగా పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. కోలాట వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయం ప్రకారం కోడిపుంజులను ముఖాముఖి చూపించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు గత ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి బొమ్మతో ముద్రించి పంపిణీ చేసిన పట్టాదారు పాసు పుస్తకాలను స్వచ్ఛందంగా తెచ్చి భోగిమంటల్లో తగులబెట్టారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం రాజ ముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడంతో స్థానిక రైతులే స్వచ్ఛందంగా గత ప్రభుత్వ పాస్ పుస్తకాలను భోగి మంటల్లో తగులబెట్టారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి ఉజ్వల భవితను దృష్టిలో ఉంచుకుని పరిపాలన జరుగుతుందన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ కు పూర్వ వైభవం వస్తున్నట్లుగా తెలుగు ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణతో విస్తృత స్థాయిలో ఉపాధి కల్పనకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు. మెరుగుపడతాయని అన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పేదలు కూడా సంతోషంగా ఉన్నారని అన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం వెలిగిపోతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తి రాష్ట్రమంతటా వ్యాపించాలి

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర వైస్ఛైర్మన్ రామచంద్రరాజు




**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తి రాష్ట్రమంతటా వ్యాపించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ వైస్ఛైర్మన్ రామచంద్ర రాజు అన్నారు. బుధవారం స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన ఆయన స్వచ్ఛ చల్లపల్లి రథసారధి, ఐఆర్సీఎస్ జిల్లా చైర్మన్ డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఉద్యమ ప్రస్థానాన్ని డిఆర్కె తెలియ చేశారు. పద్మావతి హాస్పటల్ బజారు, హైవేపై చల్లపల్లి ప్రవేశద్వారం, పర్యావరణ హితం కోరుతూ నా టిన మొక్కలను, పబ్లిక్ టాయిలెట్ చల్లపల్లిలోని పలు ప్రదేశాలను డిఆర్కెతో కలిసి రామచంద్రరాజు చూశారు. 11 సంవత్సరాలుగా నిర్విరామంగా స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం కొనసాగించటం స్ఫూర్తిదాయకమని తెలిపారు. గ్రామం కోసం నిస్వార్థంగా స్వచ్ఛ సేవలు అందించటం డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్ డాక్టర్ పద్మావతిలకే సాధ్యమైందనీ, వారి నాయకత్వాన చల్లపల్లి గ్రామం రోల్మోడల్గా నిలిచిందన్నారు. చల్లపల్లి మోడల్ రాష్ట్రమంతటా విస్తరిస్తే గ్రామా లు ఎంతో స్వచ్ఛతగా, సుందరంగా ఉంటాయన్నారు. ప్రభుత్వమే అన్నీ చేయలేదనీ, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను విస్తృతంగా అందించేందుకు ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. చల్లపల్లి సందర్శన మధురానుభూతిగా మిగిలిపోతుందనీ, ఎటుచూసినా మొక్కలు, పచ్చదనం, పూలమొక్కలు మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నట్లు సంతోషం వ్యక్తం చేశారు. చల్లపల్లిలో ఏం జరుగుతోంది.. ఎందుకు జరుగుతోంది పేరుతో డాక్టర్ గురవారెడ్డి ముద్రించిన స్వచ్ఛోద్యమ ప్రస్థానం ఫొటో బుక్లెట్ను డిఆర్కె. ప్రసాద్, రామచంద్రరాజుకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్సీఎస్ చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర ఉన్నారు.

## డిప్యూటీ మేయర్ శైలజ ఆధ్వర్యంలో భోగి వేడుకలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** డిప్యూటీ మేయర్ అవుతు శైలజ రెడ్డి ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శైలజ మాట్లాడుతూ సంక్రాంతిని ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు పాల్గొన్నారు

## వైభవంగా శ్రీగోదా రంగనాధుల కళ్యాణం





**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీగరుడ ఆంజనేయ సహిత శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా భోగి పండుగ రోజైన బుధవారం శ్రీగోదా రం గనాధుల కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వం తరాచార్యులు కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. గర్భాలయంలోని మూలవిరాట్కు విశేష అలంకరణలు చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించగా, వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరిం చారు. ఆలయ కమిటీ పెద్దలు మోపిదేవి ద్వారకానాథ్, పత్రి హనుమంతరావు, నూజెళ్ల బాబు, ఉప్పల ఏడుకొండలు, బొందలపాటి వెంకటేశ్వరరావు, కొల్లిపర లక్ష్మీనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వేలేరు గ్రామంలో సాంప్రదాయ భోగి వేడుకలు ఘనంగా నిర్వహణ



**హనుమాన్ జంక్షన్, జనవరి 14, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం వేలేరు గ్రామంలో భోగి పండుగను సాంప్రదాయ బద్ధంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామ మండపం వద్ద ఏర్పాటు చేసిన గొబ్బెమ్మలు, భోగి మంటలు, చెరుకు గడలు, రంగవల్లులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామంలోని ప్రతి కూడలిలో భోగిమంటలు ఏర్పాటు చేసి పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మలిచారు. ఈ వేడుకల్లో వయోవృద్ధులు, యువత, మహిళలు, విద్యార్థులు, చిన్నారి బాలబాలికలు పెద్ద ఎత్తున పాల్గొని సంప్రదాయానికి జీవం పోశారు. ముందుగా గ్రామంలో అత్యధిక వయస్సు కలిగిన కంచర్ల సీతారామయ్య (93), నదిగం రామకృష్ణ (88), అవిర్నేని సత్యనారాయణ (78) కాగడతో భోగి మంటలు వెలిగించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళలు పాల పొంగళ్ళు పెట్టి, గొబ్బెమ్మల ఆటలు, పాటలు, సంప్రదాయ గీతాలతో సంబరాలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. తదుపరి వేములపల్లి సత్యనారాయణ

### కులమతాలకు అతీతంగా ఏకతాటిపై గ్రామస్తుల సంబరాలు

శ్రీహరి వేద ఇన్నోవేటివ్ పార్క్ ఎండీ & డైరెక్టర్లు జాతీయ జెండాను ఊపి 'రన్ ఫర్ యూనిటీ 5కే రన్' ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామస్తులందరూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పండుగలను జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రజలందరూ పాడి పంటలతో, ఆరోగ్యంతో, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అవిర్నేని భవానీ శంకరం సొసైటీ అధ్యక్షులు అవిర్నేని హేమ సూర్యప్రసాద్, కాజా సురేష్, అంగడాల సీతయ్య, పోలగాని వెంకటేశ్వరరావు, భాణావతుల స్వామి, బి. బసవరాజు, అబ్దుల్ కలాం, రాచప్రోలు సతీష్ తదితరులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



# అంగరంగ వైభవంగా నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు విగ్రహ విష్కరణ మచిలీపట్నంలో జరిగింది. మచిలీపట్నం హౌసింగ్ బోర్డు బైపాస్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆవిష్కరించారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు చిగురుపాటి శ్రీరామ్, డిసిఎంఎస్ చైర్మన్, జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ, కృష్ణా యంజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి గొపు సత్యనారాయణ,తదితర కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీ రామారావు వీరాభిమానులను మంత్రి కొల్లు రవీంద్ర ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ, కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయి, దివంగత ముఖ్యమంత్రి తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమన్నారు. గత నెలలో ఇదే ప్రాంతంలో వాజ్ పేయి విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఆవిష్కరించుకున్నామని తెలిపారు. ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం శుభపరిణామంగా మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి అగ్ర ప్రాధాన్యం ఇస్తూ ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు. ఇరువురు ఆదర్శ రాజకీయ నేతల విగ్రహాలను మచిలీపట్నంలో ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రధానిగా వాజ్ పేయి సేవలు దేశ ప్రజలు మరువలేరన్నారు. అలాగే తెలుగు వారికి కీర్తిని ప్రపంచంలో నలు దిశలా వ్యాపించే విధంగా కృషిచేసిన నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా మిగిలిపోతారన్నారు. ఈ ఇరువురి విగ్రహాలు కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నానికే కాక యావత్తు జిల్లాకే గర్వకారణమని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు.

# సంక్రాంతి వేడుకల్లో జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నగరపాలక సంస్థ నాలుగో డివిజన్ కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి వేణు దంపతుల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా బుధవారం భోగిని పురస్కరించుకొని వారి స్వగృహంలో భోగి మంటలు,చిన్నారులకు భోగి పళ్ళు పోయుట, బొమ్మల కొలువు, గంగిరెద్దుల ఆశీర్వచనాలు ఏర్పాటు చేశారు. మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొని సంక్రాంతి వేడుకలు నిర్వహించారు బండి రామకృష్ణ చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను ఛాయాదేవి వేణు దంపతులు అందజేయించారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ ఈర్ష అసూయ ద్వేషం అహం భోగి సాక్షిగా భోగిమంటల్లో కలిపి మన జీవితంలో నూతన తేజాన్ని నింపేది సంక్రాంతి అని రాష్ట్రం అభివృద్ధి చెంది రైతు పాడిపంటలతో ధనధాన్యభివృద్ధి చెంది ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు,కొక్కులక్ష్మణ, గంపల భవాని,మహమ్మద్ సమీర్, శాయన శివయ్య, కృష్ణ, రామ్ జ్యోతి, కోటి, భాస్కర్,రాజేష్, త్రిపురారితరుణ్, కొండ మేస్త్రి, సుదర్శన్,నూకలసాయి గణేష్, మంత్రి పృథ్వి గోపాల్,గణేష్,తిరుమల శెట్టిరాజు జనసేన పార్టీ ప్రతినిధులు నాయకులు వీర మహిళలు ఛాయాదేవి కుటుంబ సభ్యులు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# ఎంపీ కార్యాలయంలో అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు





**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ కార్యాలయం లో సంక్రాంతి పండగ సంబరాలు వైభవం గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులు, జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, ఇతర నాయకులతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య కలసి పాల్గొన్నారు. భోగి మంటలు, గంగిరెద్దులు, రంగురంగుల ముగ్గులు, హరిదాసు కీర్తనలు తో తెలుగు పల్లె సాంప్రదాయానికి అద్దం పట్టేలా సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు సాంప్రదాయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, సంక్రాంతి అందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలిపారు జంపాల సీతారామయ్య. ఈ సందర్భం గా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ కు శాలువా కప్పి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు జంపాల సీతారామయ్య. తెలుగు సాంప్రదాయ దుస్తుల్లో విజయవాడ ఎంపీ శివనాథ్, సీతారామయ్య సంబరాల్లో పాల్గొన్నారు.



## డిప్యూటీ మేయర్ శైలజ ఆధ్వర్యంలో భోగి వేడుకలు

**విజయవాడ మేజర్ న్యూస్ :** డిప్యూటీ మేయర్ అవుతు శైలజ రెడ్డి ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శైలజ మాట్లాడుతూ సంక్రాంతిని ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు పాల్గొన్నారు.

## చిన్నారులకు భోగి పళ్ళు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** చిన్న ఆకులమన్నాడు గ్రామంలోని శ్రీ అభయ కోదండరామ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఆలయ పాలకవర్గం ఆధ్వర్యంలో పదేళ్ల లోపు చిన్నారులకు భోగి పళ్ళు సంప్రదాయ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన చిన్నారులు, వారి తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చక స్వాములు వేద మంత్రోచ్చారణలతో చిన్నారులకు ఆశీర్వచనాలు అందజేయగా, తల్లిదండ్రులు సంప్రదాయబద్ధంగా భోగి పళ్ళు వేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కూడా చిన్నారులను ఆశీర్వాదించారు. నేటి తరం ఆధునికత వైపు అడుగులు వేస్తున్న ఈ కాలంలో, మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలను కొత్త తరం పిల్లలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆలయ పాలకవర్గం తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలలో మన సంప్రదాయాల పట్ల గౌరవం పెరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, చిన్నారులు ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భోగి పళ్ళు కార్యక్రమం గ్రామంలో సంప్రదాయ వైభవాన్ని మరోసారి చాటిచెప్పిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు బాడీ గాడ్ లాంటి వాడు

**జనసేన నాయకులు కార్యకర్తలు కూటమి నాయకులకు ఊడిగం చేస్తున్నారు**

**జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి పులిపాక ప్రకాష్ బాబు**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ బాడీగార్డ్ లాగా పనిచేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన జిల్లా కార్యదర్శి పులిపాకప్రకాష్ ఘాటుగా విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లాజి కొండూరు గ్రామం లో బుధవారం సాయంత్రం పులిపాక స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో కూటమి నాయకులపై ధ్వజమెత్తి సవాలు విసిరారు.. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుపవన్ కళ్యాణ్, అలాగే మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంతకు జనసేన స్థానిక ఇంచార్జ్ అక్కల గాంధీ ఒంటిపై ఈగ వాలకుండ ప్రతినిత్యం చూస్తున్నారన్నారు. జనసేన ప్రజా సమస్యల కోసం పనిచేయటం కోసమే పుట్టిందన్నారు. ఏడు సిద్ధాంతాలను జనసేన అధిష్టానం పూర్తిగా విస్మరించిందని, సనాతన ధర్మం అంటూ మతవిద్వేశాలను పవన్ కళ్యాణ్ రెచ్చగొడుతున్నారని పులిపాక పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ అమరావతి వెలిగి పోతుందంటూ ఎమ్మెల్యే వసంత ఒక దంపుడు ఉపన్యాసాలు చెప్తున్నారని ప్రజలు ఆయన భావజాలాన్ని గమనిస్తున్నారని పులిపాక ప్రకాష్ బాబు పేర్కొన్నారు మైలవరం నియోజకవర్గంలో వైసిపి గొంతు మూగబోయిందని ప్రశ్నించే నాయకుడు లేడని ఎద్దేవా చేశారు. తాను ప్రజల గొంతుకనీ, నిత్యం ప్రజా సంస్థలపైనే పనిచేస్తానని అందుకు ప్రజలు సహకరించాలని పులిపాక ప్రకాష్ బాబు కోరారు.



## ఎస్పీని కలిసిన ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడును ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ఆధ్వర్యంలో నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ క్యాలెండర్‌లు, అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పర్యావరణహిత నార సంచులను ఎస్పీకి అందచేసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యా సాగర్ నాయుడు మాట్లాడుతూ, పోలీస్ శాఖకు సంబంధించి ఉద్యోగులతో పాటు ప్రజల సమస్యలు ఏమైనా అసోసియేషన్ దృష్టికి వస్తే సంబంధిత పోలీస్ అధికారులకు తెలపాలన్నారు. తద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నేతలకు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ,మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల రక్షణ, తదితర అంశాల్లో కృష్ణాజిల్లా పోలీసు శాఖను రాష్ట్రంలో ఉన్నత స్థానంలో ఉంచేలా పోలీసులు చేస్తున్న కృషికి అసోసియేషన్ పక్షాన పూర్తి సహాయసహకారాలు అందిస్తామని సురేష్ ఎస్పీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు మెరుగు వేణుగోపాలరావు, దేవరపల్లి కోటయ్య,కుతాడి పార్వతి, జి.కోటేశ్వరరావు, ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా భోగి వేడుకలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** భోగి వేడుకలను బుధవారం స్వచ్ఛ కార్యకర్తలు సందడిగా జరుపుకున్నారు. సన్ఫ్లవర్ సెండర్ సిటీకి వెళ్లే దారిలో కడియాల వారి ఇంటి వద్ద స్వచ్ఛ కార్యకర్త కడియాల భారతి ఆధ్వర్యంలో భోగి వేడుకలు జరుగ్గా, స్వచ్ఛ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయాన్నే వేకువ జామున భోగిమంటలు వేసి మహిళలు భోగిమంటల చుట్టూ పాటలు పాడుతూ సందడిచేశారు. సంప్రదాయబద్ధంగా పాగపొంగలి వండటం, చి న్నారులకు భోగిపండ్లు పోయటం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృ తిక ప్రదర్శనలు అలరించాయి. సంప్రదాయ వస్త్రధారణతో మహిళలు భోగివేడుకలో పాల్గొన్నారు. స్వచ్ఛ చల్లపల్లి సారధులు డాక్టర్ డిఆర్ కె.ప్ర సాద్ – డాక్టర్ పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, దాసరి స్నేహ, డాక్టర్ మాలెంపాటి గోపాలకృ ష్ణయ్య, ప్రాతూరి శాస్త్రి, కడియాల సురేష్, టి.సాంబశివరావు తదితర స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకుమాని రామకృష్ణ లక్ష్మి దంపతులు మన కోసం మనం ట్రస్టు రూ.10వేల విరాళం అందచేశారు.

## వాడవాడలా భోగిమంటలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** తెలుగువారి సాంప్రదాయాలకు సంస్కృతికి అద్దం పట్టే పెద్ద పండుగ సంక్రాంతి. కుల మతాలకు అతీతంగా పేద ధనిక తేడా లేకుండా ప్రతి ఇంట జరుపుకునే సంక్రాంతి వేడుకలలో భోగి పండుగకు ప్రత్యేకత సంతరించుకుంటుంది. బుధవారం ఎక్కువ జాము నుండే భోగిమంటలతో వీధులు వెలుగులతో నిండిపోయాయి. అవనిగడ్డ మండలంలో వాడవాడలా కూడలి ప్రాంతాలలో ఉత్సాహంగా భోగి మంటలు వేసి పండుగ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కుటుంబం భోగిమంటల కార్యక్రమంలో పాల్గొనగా, ఎస్ వి ఎల్ క్రాంతి కళాశాల ప్రాంగణంలో కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వ రరావు ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. మండల పరిధిలోని బందలాయిచెరువు ఎస్సీ కాలనీలో యువకులు భారీగా భోగిమంటల వేసి వేడుక జరుపుకున్నారు. భోగి పండుగను పురస్కరించుకుని ప్రతి ఇంటిలోనూ చిన్నారులకు వేడుకగా భోగి పళ్ళు పోసి ఆశీర్వదించారు.

# జక్కంపూడిలో అయ్యప్ప మకరజ్యోతి దర్శనం

### దర్శించి తరించిన భక్తజనం





**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం అదృష్టంగా భావించే భక్తులు అక్కడికి వెళ్లలేని వారు విజయవాడ రూరల్ మండలంలోని జక్కంపూడి గ్రామంలో మకరజ్యోతి ని దర్శించి తరిస్తారు. అందులో భాగంగానే ఎన్టీఆర్ జిల్లాలోని జక్కంపూడి గ్రామంలో అయ్యప్పస్వామి దేవస్థానంలో మకర జ్యోతి దర్శనం చేసుకున్న భక్తులు పరవశించిపోయారు. అయ్యప్ప స్వామి ఎదురుగా గల కొండపైభాగం నుంచి జ్యోతిని వేలాది సంఖ్యలో భక్తులు మూడుసార్లు దర్శించుకుని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మకరజ్యోతి దర్శనం అయ్యప్ప స్వామి ఆశీర్వాదంగా భావిస్తారు. అయితే జ్యోతి కనిపించిన వెంటనే ఆలయంలో హారతి, మంగళవాయిద్యాలు ప్రారంభమయ్యాయి. ఈ అపురూప దర్శనంతో భక్తులు పులకించిపోయారు. దర్శనం తరువాత భక్తులు ఇరుముడి సమర్పణ చేసి దీక్ష విరమింపచేశారు. మకరజ్యోతి దర్శనం అనంతరం మకరవిలక్కు పూజను భక్తులు తిలకించారు. ఆలయ ప్రాంగణం చుట్టూ మకర జ్యోతి దర్శనం చూడటానికి భక్తులు కిక్కిరిసిపోయారు. ఆలయంలో భక్తులకు అన్ని వసతులను భక్తి శ్రద్ధలతో నిర్వహించిన కమిటీ సభ్యులకు భక్తులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ హిమ వెంకట శివప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎడ్ల సాంబశివరావు,కోశాధికారి టీవీఎస్ మల్లేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మేడూరు నరేంద్ర,, ఆలయ కమిటీ సభ్యులు అయ్యప్ప స్వామి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.






# శ్రీ కొండలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు





**గుడ్లవల్లేరు జనవరి 14 మేజర్ న్యూస్:** శ్రీ మాత్రే నమః గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుచున్న సంక్రాంతి పండుగ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవార్లకు అభ్యంగన స్నపన, తదనంతరం ప్రత్యేక అలంకరణలు వివిధ పూజా కార్యక్రమములు ఆసాధి అర్చక స్వాముల చే నిర్వహించడం జరిగినది. దేవాలయ దగ్గరలో భోగిమంటలు కూడా ఏర్పాటు చేసియున్నాము అనంతరం భోగి పండుగ సందర్భంగా శ్రీ అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు ఆలయ చైర్మన్ ఈడే మోహన్‌చే భోగి పళ్ళను పోయడం జరిగింది. వేమవరం గ్రామం నుండే కాక ఇతర గ్రామాల నుండి కూడా చిన్నారులు పాల్గొని ఉన్నారనీ భక్తులకు ఉచిత ప్రసాదం పంచుట జరిగింది. గుడివాడ వాస్తవ్యులు పెద్దింటి లోహిత్ కుమార్ శ్రీ అమ్మవారి 10,101 రూపాయలు విరాళ్ళని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో దేవస్థానం చైర్మన్ ఈడే మోహన్, ధర్మకర్తల సభ్యులు కళ్లేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

# దివిసీమలో వైభవంగా శ్రీ గోదా కళ్యాణం





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదాదేవి జయంతి కార్యక్రమంలో భాగంగా దివిసీమలోని పలు వైష్ణవ ఆలయాలలో గోదా కళ్యాణం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. బుధవారం మండల కేంద్రమైన అవనిగడ్డలోని గీత మందిరం లో వేకువ జాము నుండి గోదాదేవి రంగనాథ స్వామి లకు విశేష అభిషేకాలు అర్చనలు నిర్వహించారు ఆగమ పండితులు దేవి సాయి పని కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో ధర్మకర్త హరి బాబు అరుణ పోతన ప్రకాష్ హేమ దంపతులు కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా సామూహిక శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణము శ్రీ లక్ష్మీ సహస్రనామ స్తోత్ర పారాయణములు గావించారు. ఈ సందర్భంగా దాదాపు వెయ్యి మది భక్తులకు అన్న సమారాధన చేశారు. మండల పరిధిలోని మోదుమూడి, వేకనూరు గ్రామాలలో శ్రీ గోదా దేవి శ్రీ రంగనాదుల కళ్యాణ ఉత్సవాలను కనుల పండుగగా జరుపుకున్నారు. మోదుమూడిలో ఆధ్యాత్మిక గురువు మువ్వా రంగరాజు పెరుమాళ్, చిన్న జీయర్ స్వామి వారి భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని వీక్షించారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు జనవరి 23 చివరి తేదీ

## విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్న కుమార్



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అనదికార లే-అవుట్లు, ప్లాట్ల క్రమబ ద్ధీకరణ, అనధికార భవన నిర్మాణ క్రమబద్ధీకరణ పథకా లను సద్వినియోగం చేసుకోవా లని చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ అన్నారు. 30-06-2025 వరకు వేసిన అన దికార లే-అవుట్లు / ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుము, 14% ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించుటకు జనవరి 23, 2026 చివరి తేదీ అని, విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ బుధవారం ఉదయం విడుదల చేసిన ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అందులో భాగంగా ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ దరఖాస్తు ప్రక్రియను తెలిపారు లైసెన్సు సర్వేయర్ /ఇంజనీర్లు / ఆర్కిటెక్టు ద్వారా అనధికార లే-అవుట్ (నాన్-లే-అవుట్) లో ఉన్న మీ స్థలం ప్లాన్లు తయారు చేయించుకోని, అపరాధ రుసుములో 50% (లేదా కనిష్టం రూ.10,000) చెల్లించి, ఆన్లైన్ లో (http://lrsdtcp.ap.gov.in/) దరఖాస్తు చేసుకోవాల్లని అన్నారు. క్రమబద్ధీకరించని అనధికార లేఅవుట్లు / ప్లాట్లను పరిశీలించి, చట్టం ప్రకారం జరిమానా విధించబడుతుందని, అటువంటి ప్లాట్లకు విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, డ్రైనేజీ, స్వేచ్ఛా కాలువ సదుపాయాలు అనుమతించబడవని, అటువంటి ఆమోదం లేని లేఅవుట్లను రిజిస్ట్రేషన్ శాఖ "నిషేధ ఆస్తి వాచ్ రిజిస్టర్"లో నమోదు చేయబడతాయి, అటువంటి స్థలములలో ఏదైనా అమ్మకం లేదా లావాదేవీలు అనుమతించబడవని, భవన ఆమోద అధికారి ద్వారా అటువంటి ఆమోదం లేని లే-అవుట్లు/ప్లాట్లలో కట్టడ అనుమతులు పరిగణించబడవని అన్నారు. కావున అనధికార లే-అవుట్లు/ ప్లాటుల యజమానులు వారి ప్లాటులను క్రమబద్ధీకరించుకొనుటకు గాను, ప్లాట్ల యజమానులకు రాయితి కలదని అన్నారు. డెవలపర్లు / భూమి యజమానులు అనధికార లే-అవుట్లు (నాన్-లే-అవుట్లు) లో ఉన్న అన్ని ప్లాట్ల వివరాలు, లే-అవుట్లను వెంటనే విజయవాడ నగరపాలక సంస్థకు స్వయంగా / ప్రతినిధి ద్వారా సమర్పించాలని, అనధికార టి-అ వుట్లు / ప్లాట్ల యజమానులు, ఆన్లైన్ ద్వారా క్రమబ ద్ధీకరించుకొనుటకు ప్రభుత్వం కల్పించిన ఈ సదవకా శాన్ని ఉపయోగించుకొనగలరని తెలిపారు. అంతేకా కుండా, అనధికార భవనాలను క్రమబద్ధీకరించుటకు "భవన క్రమబద్ధీకరణ పథకం 2025 కింద 1985 జనవరి 1వ తేదీ తర్వాత నుండి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు నిర్మించిన అనధికార భవనాలు, లేదా ఆమోదిత నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు విస్తరణలు క్రమబద్ధీకరణకు అర్హులని, అర్హులైన భవన యజమానులు పథకం 11.03.2026 లోపు దరఖాస్తులను సమర్పించవలసి ఉంటుందని, దరఖాస్తులు ఆన్లైన్ పోర్టల్ www.bps.ap.gov.in ద్వారా మాత్రమే సమర్పించాలని, దరఖాస్తులను అర్హత కలిగిన లైసెన్స్ టెక్నికల్ పర్సనల్ ద్వారా తయారు చేసి, అవసరమైన పత్రాలతో కలిపి ఆన్లైన్ మాడ్యూల్లో అప్లోడ్ చేయాలని, ఈ పథకం కింద 31.12.1997కు ముందు నిర్మించిన భవనాలకు ప్రభుత్వం క్రమబద్ధీకరణ రుసుముపై 25% రాయితీ మంజూరు చేసిందని, దీని కోసం 31.12.1997 లోపు చెల్లించిన ప్రాపర్టీ ట్యాక్స్ రశీదు జతపరచాలని అన్నారు. అర్హులైన అన్ని భవన యజమానులు నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకొని తమ భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గడువు ముగిసిన తరువాత దరఖాస్తు చేయని వారు లేదా చట్ట విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగించేవారిపై ప్రస్తుత చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జారీ చేసినందున దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. మరిన్ని వివరముల కొరకు విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని సంప్రదించగలరని అన్నారు.

# ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీ షిరిడీ సాయి మందిర మహిళా నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలను ఎంపిక చేసి ప్రోత్సాహ బహుమతులను జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి చేతుల మీదుగా అందజేశారు. ఆ మందిర అభివద్ధి చైర్మన్ కానూరి బాలకష్ణమోహన్(బాలు) ఆర్థిక సాయంతో గహోపకరణాలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో ఆ మందిర మహిళా నిర్వాహకులు వడ్లమూడి శైలజ, బొబ్బా ఝాన్సీలక్ష్మీ, వడ్లమూడి పద్మజ, పడమటి సుజాత, వడ్లమూడి సీతారావమ్మ, తూము ప్రమీలారాణి, చాపరాల విజయలక్ష్మి, కళ్లేపల్లి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# అవనిగడ్డ కోర్టు చరిత్రలో మండలి పాత్ర మరువలేనిది



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** 65 సంవత్సరాల అవనిగడ్డ న్యాయస్థానాల చరిత్రలో స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు పాత్ర మరువలేనిదని అవనిగడ్డ న్యాయవాదులు తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, తెలుగు జాతి రత్నం స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం వంతెన సెంటర్లో కృష్ణారావు విగ్రహానికి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, మాదివాడ వెంకట కృష్ణారావు, రామిశెట్టి వేణుగోపాలరావు, గోల్తి గౌరీ శంకర్, పులిగడ్డ నాగేంద్రుడు, బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు ఆధ్వర్యంలో నియోజకవర్గ న్యాయవాదులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మాట్లాడుతూ అవనిగడ్డలో న్యాయ వ్యవస్థ ఏర్పాటు కోసం మండలి వెంకట కృష్ణారావు కృషిని వివరించారు. అవనిగడ్డలో న్యాయస్థానాల ఏర్పాటుకు మండలి వెంకట కృష్ణారావు చేసిన కృషి చిరస్మరణీయంగా నిలిచి ఉందన్నారు. ఆ విధంగా అవనిగడ్డలో మండలి వెంకట కృష్ణారావు కృషితో 1960లో ప్రారంభమైన కోరుతూ దినదినాభివృద్ధి చెందుతూ 2025నాటికి ఆరవ అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు స్థాయికి ఎదిగేందుకు మూల కారకులుగా మండలి వెంకట కృష్ణారావు నిలిచారన్నారు. తద్వారా అవనిగడ్డ న్యాయస్థానాల్లో ప్రాక్టీస్ చేసిన న్యాయవాదులు, పనిచేసిన న్యాయమూర్తులు ఉన్నత శిఖరాలకు చేరుకోవటానికి ప్రధాన కారకులుగా మండలి వెంకట కృష్ణారావు నిలవడంలో ఎలాంటి సందేహం లేదని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ న్యాయవాదులు తిమ్మన సుబ్బారావు, ఇమ్మిడిశెట్టి సుబ్బారావు, తలశిల శివరామకృష్ణ, బచ్చు శేఖర్ బాబు, రాయపూడి వేణుగోపాలరావు, కొడాలి మురళీ, యార్లగడ్డ పూర్ణ మల్లికార్జున ప్రసాద్, దామెర్ల శివ నాగరాజు, మత్తి రాజీవ్, వేములపల్లి రవిచంద్ర, మోపిదేవి సాయి ఆదిత్య, కొల్లూరి రామాంజనేయులు, ఆరే దైవకృప, శ్రీపతి బాలసుబ్రమణ్యం, పోతుల వెంకట శివ శ్రీనివాస్, తుటారం ప్రసాద్, కామరాజుగడ్డ మోహన్, శత జయంతి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘంటసాల పోలీస్ స్టేషన్పై యువకుల దౌర్జన్యం

## ఘంటసాలలో బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది




**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల అంబేడ్కర్నగర్కు చెందిన కొందరు యువకులు పోలీస్ స్టేషన్పైనే దౌర్జన్యానికి దిగారు. క్రికెట్ పాయింట్ వద్ద జరిగిన గొడవ విషయమై స్టేషన్కు వచ్చిన ఈ యువకులు, విచక్షణ కోల్పోయి ఎస్సై ప్రతాపరెడ్డి, కానిస్టేబుల్, హోంగార్డుపై దాడికి పాల్పడ్డారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడి చేయడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. మిగతా నలుగురు పరారీలో ఉండటంతో పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నట్లు సమాచారం. డిఎస్పి విద్యశ్రీ తో పాటు నియోజకవర్గంలోనీ, సిఐలు, 6 మండలాల ఎస్సీలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామికి వెండి, బంగారు ఆభరణాలు అందజేత



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** స్థానిక నిమ్మలతోటలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి వారి క్షేత్రంలో స్వామివారికి రూ.11 లక్షలకు పైగా విలువైన వెండి, బంగారు ఆభరణాలను దాతలు బహూకరించారు. పడమరవీధికి చెందిన ఉమ్మినేని సుబ్బారావు మనుమడు(గంగాధరరావు కుమారుడు) ఉమ్మినేని శంకర సుధీర్ మేఘన దంపతులు అరకిలో వెండితో శ్రీఅయ్యప్ప స్వామికి కిరీటం, రూ.67గ్రాముల బంగారంతో చెవుల ఆభరణాలను తయారుచేయించి బుధవారం సాయంత్రం ఆలయంలో అందచేశారు. కర్పూరజ్యోతి కార్యక్రమంలో భాగంగా స్వామివారి ఆభరణాలను ధర్మకర్త అన్నవరపు పాండురంగారావు గురుస్వామి ఇంటి వద్ద నుంచీ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆభరణాల ఊరేగింపుతోపాటుగా దాతలు ఇచ్చే ఆభరణాలను సైతం ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం వెండి కిరీటాన్ని, చెవుల ఆభరణాలను స్వామివారికి అలం కరించారు. ఈ సందర్భంగా శబరిమలలో మరకజ్యోతి దర్శన సమయంలో కర్పూర జ్యోతి కార్యక్రమం జరిగింది. అయ్యప్పదీక్షాపరులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. విలువైన ఆభరణాలను అయ్యప్పస్వామికి అందచేసిన దాతలను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

# ఘట్టమనేని సేవలు పలువురికి ఆదర్శం




**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గోగినేనిపాలెంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతి ఏడాది ఘట్టమనేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఘట్టమనేని బాబురావు పేదవర్గాలకు చేస్తున్న సేవలు పలువురుకు ఆదర్శంగా నిలిచాయని మాజీ సర్పంచ్ అత్తలూరి గోపాలకృష్ణ పేర్కొన్నారు ఘట్టమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులకు నూతన వస్త్రాలను బహూకరించారు. మాజీ సర్పంచ్ అత్తలూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ, గతకొన్నేళ్లుగా భోగి పండుగ రోజునే గ్రామంలో వృద్ధాప్యంలో ఉన్న వారందరికీ నూతన వస్త్రాలను అందచేసి వారికి పండుగ సంతోషాన్ని కలిగిస్తున్న బాబూరావు సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. 84మంది వృద్ధులకు నూతన వస్త్రాలతోపాటు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయల చొప్పున నగదు, వికలాంగులు ఎనిమిది మందికి నూతన వస్త్రాలతోపాటు రూ.1500 నగదు, ఇంజనీరింగ్ విద్యార్థి కుంపటి సుప్రజకు ల్యాప్టాప్, ఇంటర్మీడియట్ విద్యార్థిని కుంపటి చరిష్మాకు రూ.10వేల నగదును అందచేశారు. ఈ కార్యక్రమంలో వేమూరి సత్యం, ఘట్టమనేని మారుతీప్రసాద్, కుంపటి వెంకటేశ్వరరావు, కొడాలి నాగమల్లి, గన్నపనేని వెంకటేశ్వరరావు, మాలెంపాటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు..

# వైభవోపేతంగా గోదాదేవి కళ్యాణం

## దైవిక అనుభూతితో పులకించిన భక్తజనులు - పెద్ద సంఖ్యలో భక్తుల హాజరు





**విజయవాడ మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మ తోటలోని దేవస్థానంలో నిర్వహించిన గోదాదేవి కళ్యాణం భక్తుల హృదయాలను పరవశింపజేసింది. శ్రీవైష్ణవ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ఈ పుణ్యకార్యక్రమం ఆధ్యాత్మిక శోభతో, వేద మంత్రోచ్చారణల నడుమ అత్యంత ఘనంగా సాగింది. ఆలయ ప్రాంగణం అంతటా మంగళవాయిద్యాల నాదాలు, సుగంధ పుష్పాల అలంకరణలు భక్తుల్లో ప్రత్యేకమైన ఆనందాన్ని నింపాయి. ధనుర్మాసం ఆరంభం నుంచి దేవస్థానంలో నిత్యం గోదాదేవి, శ్రీకృష్ణుల స్వామివార్లకు నిత్య కైంకర్యాలు అర్పించారు. అండాళ్‌గా ప్రసిద్ధి చెందిన గోదాదేవి, పరమభక్తితో విష్ణువునే వరుడిగా కోరిన మహానుభావురాలు. ఆమె భక్తి, త్యాగం, ప్రేమకు ప్రతీకగా ఈ కళ్యాణోత్సవాన్ని తిరుమలలో నిర్వహించడం విశేషంగా భావిస్తారు. గోదాదేవి కళ్యాణం ద్వారా భక్తి మార్గంలో నిలకడ, దైవానుభూతి ఎంత శ్రేష్ఠమో భక్తులకు తెలియజేస్తుంది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆలయ పండితులు మురళీకృష్ణ స్వామి అయ్యంగార్, వెంకట శశికిరణ్ లు శాస్త్రోక్తంగా వేద మంత్రాలు చదువుతూ గోదాదేవి కథను వివరించారు. విష్ణుచిత్తుడు (పెరియాళ్వారు) తులసి వనంలో పాదాలు తీస్తుండగా అయోనిజురాలైన గోదాదేవి భూమిలో దొరికింది. ఆమెను కోదై (పూలమాల) పేరుతో పెంచుకున్నాడు, కాలక్రమేణా గోదాగా పిలిచేవారు. గోదాదేవి (ఆండాళ్) శ్రీరంగనాథుడితో ఐక్యమైన ఘటన భోగి రోజునే జరిగినట్టు పురాణాలు చెబుతాయి. ఆమె తులసీ మాలలు తయారు చేసి విష్ణుమూర్తికి అర్పించుకుని, తిరుప్పావై వ్రతంతో పరమాత్మను పొందిన మహిమ ఈ రోజు పునరావృతం అవుతుంది. ఈ కళ్యాణం సంతానం, కల్యాణ ప్రాప్తికి ఫలదాయకం అని భక్తుల విశ్వాసం. ధనుర్మాస చివరి రోజైన భోగి రోజు విష్ణుచిత్తుని కలలో శ్రీరంగనాథుడు కనిపించి గోదాను శ్రీరంగానికి తీసుకురావాలని చెప్పాడు. అక్కడ భక్తుల సమక్షంలో గోదా రంగనాథునితో ఐక్యమైంది, ఆ కల్యాణ మహిమ ఏటా భోగి రోజు పునరావృతమవుతుందని గోదాదేవి కళ్యాణ విశిష్టతను వివరించారు. కళ్యాణ వేడుకలకు హాజరైన భక్తులు దైవికమైన అనుభూతితో గోదాదేవి ఆశీర్వచనం కోసం ప్రార్థించారు. గోదాదేవి కళ్యాణ మహోత్సవ వేడుకలలో పాల్గొనే సంతానం లేని దంపతులకు సంతానం కలుగుతుందనేది పురాణ గాథ. పెద్ద సంఖ్యలో భక్తుల రాక పురస్కరించుకొని ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, ఇన్స్పెక్టర్ లలితా రమాదేవి పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. సుమారు 3000 మందికి పైగా కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. దేవస్థానం అధికారులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులందరూ కల్యాణోత్సవాన్ని భక్తిపారవశ్యంతో తిలకించారు.

## ఘనంగా నటభూషణ శోభన్ బాబు 90వ జన్మదిన వేడుకలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** స్టేట్ వైడ్ శోభన్ సిండికేట్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కళ్లేపల్లి మధుసూధనరాజు, డాక్టర్ దారా సత్యనారాయణ ఆధ్వర్యంలో అందాల నటుడు శోభన్ బాబు 90 వ జన్మదిన వేడుకలు అభిమానుల మధ్యన ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ లాకులు వద్ద ఉన్న శోభన్ బాబు విగ్రహం కు పూల మాలలు వేసి, బీదలకు మిట్టాయి పంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో స్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ చెరగని అందాల నటుడు ముద్ర వేసుకొని, నేటికీ అందాల నటుడు గానే మిగిలారని, చనిపోయి 18 సంవత్సరాలయినా ఆయన పేరుమీద నేటికీ పలు సేవా కార్యక్రమాలు చెయ్యటం అభినందించదగ్గ విషయం అన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మధుసూధనరాజు, ధారా సత్యనారాయణ మాట్లాడుతూ ఎప్పటికీ మరిచిపోలేని విధంగా అభిమానుల గుండెల్లో నిలిచారని, ఈ సెంటర్ కీ శోభన్ బాబు సర్కిల్ గా నామకరణం చేయమని ప్రభుత్వంని కోరామని, ఇంకా పలు సేవా కార్యక్రమాలు స్టేట్ వైడ్ శోభన్ సిండికేట్ సంస్థ ద్వారా చెయ్యబోతామని, చేస్తామని, క్రమశిక్షణకు మారు పేరని శోభన్ అభిమానులని గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కే.జగన్ మోహన్ రావు, ఆర్టిస్ట్ వెంకటేశ్వర రావు, ఆంజనేయులు, రెడ్డి, సలీం, ఎం. శ్రీనివాస్, బొబ్బిలి రేలా కుమార్, రామకృష్ణ, ప్రభాల శ్రీనివాస్, పైడిపాటి వెంకన్న, రైల్వే త్రినాధ్, మధుబాబు, వెంకటేష్ (గన్నవరం),రాజు, పామర్తి సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.


19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999






# అందరి కుటుంబాల్లో భోగి భోగభాగ్యాలు నింపాలి

## తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్ :** మన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించే అచ్చ తెలుగు పండుగ సంక్రాంతి అని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఈ మకర సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం నింపాలని ధనిక, పేద తారతమ్యాలు లేకుండా.. అన్ని వర్గాల ప్రజలు పండుగను సంతోషంగా జరుపుకోవాలని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆకాంక్షించారు. పామర్రులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బుధవారం ఉదయం అత్యంత వైభవంగా భోగి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేయడంతో పాటు తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు జరిపారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, ముగ్గుల పందాలు, కూచిపూడి నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఈ వేదికపై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీమణి మిశ్రమతో కలసి పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఎంతో సంతోషంగా జరుపుకోవాలని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ భోగి,సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భోగి పండుగ అందరి జీవితాల్లో సరికొత్త కాంతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. శీతాకాలపు చల్లటి గాలులను చీల్చుతూ వెలిగించే భోగి మంటలు ప్రతి ఒక్కరి జీవితంలో సరికొత్త కాంతులు తీసుకురావాలని అన్నారు. భోగి వేళ ఆటంకాలన్నీ తొలగిపోయి అందరికీ సకల శుభాలు జరగాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్ తో కలిసి ఎమ్మెల్యే కుమార్ రాజా వేదికపై డాన్స్ చేసి అభిమానులను అలరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ దంపతులు, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, మాజీ చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మండపాక శంకరబాబులతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

